

# మందారమాల

## సత్యం మందపాటి

నెలనెలా ఓ ప్రతిభామూర్తికి అభినందన మందారమాల

# చలం



'స్త్రీకి కూడా శరీరం ఉంది. దానికి వ్యాయామం ఇవ్వాలి. ఆమెకి మెదడు ఉంది. దానికి జ్ఞానం ఇవ్వాలి. ఆమెకి హృదయం వుంది. దానికి అనుభవం ఇవ్వాలి'

'బిఏ చదువుతుండగా ఒక సాయంత్రం హఠాత్తుగా చలపతిరావుకి వితంతువుల మీద ప్రేమ కలిగి, వాళ్ళ కష్టాల మీద కరుణ పుట్టింది. వితంతువును తప్ప పెళ్ళి చేసుకోనని పట్టుబట్టాడు. మేనమామ కూతుర్నిస్తామని వస్తే, ముందా అమ్మాయిని వితంతువు కానిమ్మని చెప్పి చివాట్లు తిన్నాడు'

'స్త్రీ ఒక మాట వల్ల, చూపు వల్లా పురుషునికి సందిచ్చిందా... ఇక అతని అధికారానికీ, కోరికలకీ, విన్నపాలకీ అంతం వుండదు. అసలు పర్యవసానం అక్కర్లేని స్త్రీ మొదటినించీ విముఖంగానే వుండాలి... నిప్పు వలె ఉండాలి'

'వివాహమంటే దీర్ఘకాలానికి కుదుర్చుకున్న వ్యభిచార ఒప్పందం కాకూడదు'

'అయ్యో – నా చిట్టితల్లుల్నీ, చిన్నారి పువ్వుల్నీ రక్షించండర్రా'

'ఈ జీవితానికీ నాకూ ఎన్నడూ యుద్ధమే! నా బాధతోనే కాదు, ఈ లోకంలోని బాధ అంతటితోనూ, చీకటి అంతటితోనూ నా నిరంతర పోరాటం. అందుకే ఈ చరిత్ర బాధార్ణవం... ఒక శోకార్ణవం!' అంటాడు చలం.

0 0 0

'మొదలంటూ లేని ఈ సృష్టికైన ప్రథమ చలనం శూన్యంలో స్పందించినప్పుడు పంచభూతాలతో పాటూ అవ్యక్తంగా నేనూ జన్మించాను' అని తన ఆత్మకథ 'చలం'లో చలం చెప్పుకున్నాడు.

ఆయన పుట్టింది మద్రాసులో మే 19, 1894 వైశాఖ పూర్ణిమ రోజున.

సాంప్రదాయబద్ధమైన బ్రాహ్మణ కుటుంబంలో పుట్టి, చిన్నతనంలోనే ఉపనయనం చేసుకుని, జుట్టు కత్తిరించుకుని, పిలక పెట్టుకుని, మడి కట్టుకుని, రోజూ సంధ్యావందనం చేసేవాడు చలం. హైస్కూలు పూర్తికాక మునుపే, హిందూ మతాన్నీ, పురాణాలనీ జీర్ణం చేసుకున్నాడు.

తండ్రి కోపంతో పిల్లల్ని కొట్టటం, తల్లిని సరిగ్గా చూడకపోవటం అతన్ని కదిల్చివేశాయి. 'మా నాన్న గురించి నా మొదటి జ్ఞాపకం అయిదేళ్ళప్పుడు మా నాన్న నన్ను కొట్టడం. రెండో జ్ఞాపకం మళ్ళీ కొట్టడం. మూడో జ్ఞాపకం మళ్ళీ కొట్టడం. ఇంతకన్నా కొడితే ఈ అర్భకుడు చచ్చిపోతాడేమో అనే భయంతో ఆపేవాడు' అంటాడు.

తన చెల్లెలు అమ్మమణికి ఇష్టం లేకపోయినా, వెక్కివెక్కి ఏడుస్తున్నా బలవంతంగా ఒక 'చదువుకున్న గాడిద'కిచ్చి పెళ్ళి చేయటం చూసి అతని మనసు విరిగిపోయింది.

'మా తల్లి వరుసగా పిల్లల్ని కని అర్భకురాలై ఒకటి రెండు సార్లు చావుకి సిద్ధమైంది. ఐనా వదిలేవాడు కాదా దయగల భర్త. అర్థరాత్రులు నా పసి తమ్ములు, చెల్లెళ్ళు ఏడ్చేవాళ్ళు. ప్రతి రాత్రీ తప్పకుండా అంత బలహీనంలోనూ అలసిన నిద్ర కళ్ళతో మా అమ్మ ఉయ్యాల వూపుతూ జోలపాట పాడేది'

అప్పటినించీ తండ్రి మీద అసహ్యాన్నీ, ఒక రకమైన తిరుగుబాటుదనాన్నీ పెంచుకున్నాడు. తన చుట్టూ వున్న సమాజంలో స్త్రీలని చూస్తున్న విధానం, వారిని అగౌరవంగా చూడటం, ఆ తిరుగుబాటుదనాన్ని తండ్రి మీద నించి సమాజంలోని పురుషాధిక్యం మీదకి తీసుకువెళ్ళింది. చలం జంధ్యం తీసివేసి, మళ్ళీ సంధ్యావందనం జోలికి పోలేదు. మాంసం తినటం మొదలుపెట్టాడు. అంటరాని కులాలవారితో తిరగటం మొదలుపెట్టాడు.

చదువులేని చిట్టి రంగనాయకమ్మతో పెళ్ళయాక, మద్రాసులో ఆమెని చదువుకోమని కాన్వెంట్లో చేర్పించాడు చలం. రోజూ 12 ఏళ్ళ వయసు భార్యని సైకిల్ మీద కూర్చోపెట్టుకుని, స్కూలుకి తీసుకువెళ్ళి, తీసుకు వస్తుండేవాడు. ఆరోజుల్లో ఆడ పిల్లలు స్కూలుకి వెళ్ళటమంటేనే నిషిద్ధంగా వుండేది. అలాటిది ఒక ఆడమనిషిని సైకిల్ మీద స్కూలుకి తీసుకు వెడుతుంటే వింతగానూ, అభ్యంతరంగానూ వుండి అందరూ ఎవరి ముక్కు మీద వాళ్ళు వేళ్ళు వేసుకునేవారు. అయినా చలం లక్ష్యపెట్టలేదు. అప్పుడు చలం మద్రాసులోనే బిఏ డిగ్రీ కోసం కాలేజీలో చదువుతూ వుండేవాడు.

ఇతని ధోరణి బంధుమిత్రులకీ, చుట్టుపక్కల వున్న అగ్ర కులాలవారికీ నచ్చలేదు. ముఖ్యంగా పిల్లనిచ్చిన తన మామగారికీ, తన తండ్రికీ. చలాన్ని ఇంట్లోకి రాకుండా బహిష్కరించారు. తన అత్తగారు మరణించినప్పుడు, 13 ఏళ్ళ రంగనాయకమ్మతో వాళ్ళింటికి వెళ్ళాడు చలం. వాళ్ళిద్దర్నీ ఇంట్లో అడుగు పెట్టనీయలేదు పెద్దలు.

ఇవన్నీ చలం, 'చలం' అనే పేరుతో వ్రాసుకున్న ఆత్మకథలో తనే వ్రాసుకున్నాడు. అంతేకాదు ఆ పుస్తకానికి ముందుమాట కూడా తనే వ్రాసుకున్నాడు!

0 0 0

'దొంగ మర్యాదల్నీ, దగాకోరు ఆచారాల్నీ, దగుల్బాజీ సంప్రదాయాల్నీ, కుళ్ళునీ, కాలం చెల్లిన కట్టుబాట్లనీ, రెండు నీతుల్నీ, రెండు నాల్కల్నీ చీల్చి చెండాడి, ఆడదాని కన్నీళ్ళనీ, అసంతృప్తి మంటల్నీ, చిరునవ్వుల్నీ, చిన్ని ఆశల్నీ, విషాదాల్నీ, విరహబాధల్నీ, ఎక్కిళ్ళ మాటల్నీ, ఏకతారా పాటల్నీ వినిపించి, విలపించాడు చలం. చద్దికంపు కొట్టే భావాల్నీ, అనుభవాల్నీ అక్కున గట్టుకునే అంధకార రోగుల్నీ, చెయ్యి కాలి ఛస్తున్నా వేడన్నమే తింటున్నామని ఏడుస్తూ బుకాయించే కుహనా మేధావుల్నీ, స్వచ్ఛమైన స్వేచ్ఛనీ, పవిత్రమైన ప్రేమనీ పదాల దోసిళ్ళలో పెట్టి ఇస్తే, సెక్సునీ శృంగారాన్నీ మాత్రమే చూసిన వికారుల్నీ, శకారుల్నీ పార్టీల చూర్లకు వేళ్ళాడుతూ, ఇజాల కళ్ళజోళ్ళతో నిజాల్ని చూడలేక నిక్కి నీలిగే గబ్బుకంపు గబ్బిలాల్నీ, గర్విష్ఠి గోష్ఠుల్నీ, జ్యేష్ఠుల్నీ సహించి, వహించి, భరించి, క్షమించాడు చలం' అన్నారు రచయిత్రి పిన్నింటి విజయశాంతి.

మగవాళ్ళకి ఇంట్లో తమ కోరికలు తీరకపోతే, బయట తమ కోరికలు తీర్చుకుంటారు. అయినా వాళ్ళందరూ పెద్దమనుషులే. స్త్రీకి కూడా అవే కోరికలు వుండి, అవి తీరకపోతే అదేరకంగా 'బయటికి' వెళ్ళే వీలుందా? అలా చేస్తే తప్పంతా ఆమెదే అని సమాజం –

ఆమెని వెలివేయదూ! ఎందుకీ ద్వంద ప్రమాణాలు? అసలు వివాహమంటే విలువలేని వారికి వివాహం అవసరమా? అసలు వివాహ వ్యవస్థ అవసరమా? అనే దాకా వెళ్ళాడు చలం.

'చలం వివాహ వ్యవస్థనే ధిక్కరిస్తున్నాడు. విశృంఖలత్వాన్ని జనం మీద చిమ్ముతున్నాడు. స్వేచ్ఛా ప్రణయాన్ని ప్రోత్సహిస్తున్నాడు' అన్నారు సంప్రదాయవాదులు.

అయినా స్త్రీ జాతికి జరుగుతున్న అన్యాయాల్ని, దురవస్థనీ తన రచనల్లో చూపటం మానలేదు చలం.

మైదానం, శశిరేఖ, దైవమిచ్చిన భార్య, జీవితాదర్శం, బ్రాహ్మణీకం, బుజ్జిగాడు మొదలైన నవలలు, జెలసీ, ఆ రాత్రి, ప్రేమ పర్యవసానం, సత్యం శివం సుందరం మొదలైన కథా సంపుటాలు, మ్యూజింగ్స్, పాపం, ప్రేమలేఖలు మొదలైన వ్యాసాల పరంపరలూ ఎన్నో వ్రాశాడు చలం.

0 0 0

చలం వ్రాసిన వాటిల్లో మైదానం నవల చెప్పుకోదగ్గది. రాజేశ్వరి చెప్పే కథ ఇది. లాయర్ భర్త ఆమెని, ఒక మనిషిగా కాక అవసరానికి వాడుకునే ఒక వస్తువుగా చూడటం, ఏవిధమైన ప్రేమా చూపించకుండా సెక్స్ కోసమే భార్య అన్నట్టు ప్రవర్తించటం భరించలేకపోయింది. ప్రేమ కరువైన ఆమెకి అది అందించాడు అమీర్. అతనితో రాజేశ్వరి 'లేచిపోయింది'. (అతను ఆమెతో లేచిపోలేదుట!)

దూరంగా ఒక మైదానానికి వెళ్ళి, అక్కడా ప్రేమకి బదులు పురుషాహంకారానికి బలైన కథనం. ఆమె ప్రేమని కోరుకుని వెళ్ళిపోయిందా? సెక్స్ కోసం లేచి పోయిందా? స్త్రీ స్వాతంత్ర్యాన్ని, గౌరవాన్ని వెతుక్కుంటూ వెళ్ళిందా? మరి రాజేశ్వరికి అవి లభించాయా?

అమీర్ ఆమెకి కావలసినంత ప్రేమనీ, అనురాగాన్నీ, స్నేహాన్నీ పంచిపెట్టాడు. రాజేశ్వరికీ అతనితోనే ఆనందం, సుఖం, స్వర్గం, నిర్వాణం అన్నీనూ. అమీర్ ఆమెని మనసా వాచా ప్రేమించినా, అతనిలోని అసూయ, పురుష లక్షణం అతన్ని వేరే దారి పట్టించాయి. అతను వేరే దారులు వెతుక్కున్నాడు. తర్వాత కథలో మీరా ప్రవేశం.

ఇక్కడ నేను పూర్తిగా రాజేశ్వరి కథ చెప్పబోవటం లేదు. వివాహం చేసుకుని సుఖ జీవితం గడుపుదామనీ, ఒక మనిషిలా గౌరవంగా బ్రతుకుదామనీ కలలుగన్న స్త్రీ, జీవితంలో దెబ్బతిని ఎలా ప్రవర్తిస్తుందో చూపే కథ. సత్య శివ సుందరాలకి నిజాయితీతో కూడిన నిదర్శనం.

ఇది ప్రేమా, స్వతంత్ర జీవితాల కలయిక. సామాజిక సమస్యల దర్పణం. స్త్రీ జాతి విమోచన సారాంశం. నాలాటి కొంతమందికి నచ్చనిది ఈ నవల ముగించిన విధానం. అయినా చలం వ్రాసిన కాలాన్నిబట్టీ, ఆనాటి సామాజిక పరిస్థితుల్నిబట్టీ చూసే, అది నిజ జీవితాల్లో అలా జరిగేదే కనుక, ఆ ముగింపుని మనం జాలితోనే కాక, గౌరవంగానూ అంగీకరించాల్సి వస్తుందనుకుంటాను.

ఈ నవలా, చలం ఇతర కథలూ చదివి ఎక్కువమంది చలాన్ని ఒక సెక్స్ రచయితగా, వివాహ వ్యవస్థకి అడ్డంకిగా, తన స్త్రీ స్వాతంత్ర వాదంతో సమాజాన్ని పాడు చేస్తున్న వ్యక్తిగా బహిష్కరించారు. గమ్మత్తేమిటంటే, చలాన్ని పగలంతా తిట్టిపోసిన పెద్దలు రాత్రిళ్ళు ఆయన పుస్తకాల్ని దిండు క్రింద దాచుకుని, దొంగతనంగా చదివేవారుట.

ఆ వ్యభిచారం కన్నా, ఆయన స్త్రీ పాత్రలు చేసిన 'వ్యభిచారం' తక్కువే!

0 0 0

తన మహాప్రస్థానానికి ముందుమాట వ్రాయమని శ్రీశ్రీ అడిగితే, కవిత్వాన్ని తూచే రాళ్ళు తన దగ్గర లేవన్నాడు చలం. తూచ వద్దు, అనుభవించు, పలవరించు అన్నాడు శ్రీశ్రీ

'అగాధంలోంచి బైలుదేరే నల్లని అలలు మొహాన కొట్టి, ఉక్కిరిబిక్కిరై తుపానుహోరు చెవుల గింగురుమని నమ్మిన కాళ్ళ క్రింది భూమి దొలుచుకు పోతోవుంటే, ఆ చలమే నయమని వెనక్కి పరుగెత్తి చూస్తారు'

ఒక ఉదయం రుక్మిణీనాథశాస్త్రి వచ్చి, 'ఇదేమిటి ఈ మూల స్త్రీల కోసం ఇట్లా మూలుగుతున్నారు? శ్రీశ్రీ పద్యాల వేగంతో ప్రపంచపు పాత దుమారమంతా వూడ్చుకు పోతోవుంటే! ఆ హృదయాల మీద పెంకులు పగిలి పోతున్నాయి. బైట వినబడుతున్నాయి. ఇట్లా రండి రోడ్డు మీదకి?' అన్నాడు.

అంతవరకూ శ్రీశ్రీ కవిత్వాన్ని ఎరక్కపోవటం చలంలో క్షమించదగిన విషయం కాదు. కానీ చాల వాటికి క్షమించాలి చలాన్ని.

కవిత్వాన్ని, ముఖ్యంగా తెలుగు కవిత్వ కన్యల్ని చూస్తే చలానికి అసహనం, అనుమానం. శబ్ద సౌందర్యంతో తృప్తిపడి సంతోషించవలసిందే కానీ, చెప్పేదానికి అర్థం వెతకటం అవివేకం అని. కానీ నీరసపు కళాచతురులమల్లే అందాన్ని దూరంనించీ చూచి సంతోషించి, విచారించి తప్పుకోవటం చలానికి చేతకాదు. తను చెప్పదలుచుకున్న సంగతి తనకే తెలీనప్పుడు తన చేతగానితనాన్నీ, అర్థ అస్పష్టతనీ ఛందస్సు చీరల వెనకా, అలంకారాల మధ్యా, కఠిన పదాల బురఖాలలోనూ దాచి మోసగించాలని చూస్తాడు కవి – ముఖ్యంగా సహజ సౌందర్యం తక్కువైనప్పుడు. సులభంగా సూటిగా చెప్పేసి, ఇంత ధ్యానానికీ, మౌనానికీ, కార్యాలకీ, విజాయలకీ వ్యవధి నివ్వరాదా అని చలం కోరిక! ఆ పని స్త్రీలూ చెయ్యరు, దేశనాయకులూ చెయ్యరు, కవులూ చెయ్యరు, ఒక్క శ్రీశ్రీ తప్ప.

తనకీ, ప్రపంచానికీ సామరస్యం కుదిరిందాకా కవి చేసే అంతర్, బహిర్ యుద్ధారావమే కవిత్వమంటాడు చలం. అందువల్లనే దిక్కుల్నీ, దేవుల్నీ, అధికారుల్నీ వూగించి ప్రశ్నించే శ్రీశ్రీ పద్యాలు అంత అభిమానం చలానికి.

ఈ పై మాటలు మహాకవి శ్రీశ్రీ వ్రాసిన మహాప్రస్థానానికి, చలం వ్రాసిన ముందుమాటలోనివి.

ఆ ముందుమాట పేరు 'యోగ్యతాపత్రం'. దీంట్లో శ్రీశ్రీయే కాక, చలమూ కనిపిస్తాడు.

ఇది శ్రీశ్రీకి చలం ఇచ్చిన యోగ్యతాపత్రమే కాదు, అడిగి వ్రాయించుకొని శ్రీశ్రీ చలానికి ఇచ్చిన యోగ్యతాపత్రం.

0 0 0

